సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 18 | ఆగస్టు | 2023



దూరవిద్యలో ప్రవేశాలు
కేయూ పరిధి దూరవిద్యలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో 2023-24 సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

- 8లో▸



చేపల పెంపకంతో ఆదాయం
చేపల పెంపకంతో మంచి ఆదాయం లభిస్తుందని పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, కేవీకే శాస్త్ర వేత్త గణేష్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు 42మంది హాజరు
వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాల కోసం గురువారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన బ్యాటరీ పరీక్షలకు 24మంది బాలురు, 18మంది బాలికలు హాజరైనట్లు డీవైఎస్‌ఓ జి.అశోక్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియకు ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై ప్రారంభించారు. శుక్రవారం సైతం బ్యాటరీ పరీక్షలు కొనసాగుతాయని, పదేళ్ల లోపు బాలబాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 8గంటలకు జేఎన్‌ఎస్‌లో హాజరు కావాలని డీవైఎస్‌ఓ సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పరిశీలకులు జి.అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, డీఎస్‌ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇంటర్వ్యూల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తొలిరోజు హిస్టరీ, టూరిజం, ఎకనామిక్స్, కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు విభాగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సంబంధిత డీన్‌లు, విభాగాల అధిపతులు, ఇతర కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో క్యాంపస్‌లో హ్యూమనిటీస్ తదితర విభాగాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 16మంది డీబార్
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం నిర్వహించిన దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ వార్షిక పరీక్షల్లో రెండు కేంద్రాల్లో 16మంది విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15మంది, లక్సెట్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు కాపీయింగ్ చేస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు.

శ్రావణం తొలిరోజు రిజిస్ట్రేషన్ల జోరు
కాజీపేట అర్బన్: శ్రావణమాసం తొలిరోజు గురువారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. వరంగల్ ఆర్వోలో 124 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా, ఖజానాకు రూ.80లక్షల ఆదాయం సమకూరింది. శ్రావణమాస తొలి శుక్రవారం సందర్భంగా నేడు భారీగా దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనున్నాయి.

రీసెర్చ్ స్కాలర్స్‌కు లైబ్రరీ దోహదం


కాజీపేట అర్బన్: రీసెర్చ్ స్కాలర్స్ పరిశోధనలకు నిట్‌లోని సెంట్రల్ లైబ్రరీ దోహదపడుతుందని డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని బోస్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో రీసెర్చ్ ఎథిక్స్ అండ్ లైబ్రరీ రిసోర్సెస్ అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను సుబుధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సెంట్రల్ లైబ్రరీలోని పుస్తకాలను పఠనం చేస్తూ సమాజానికి తోడ్పడే నూతన ఆవిష్కరణలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వీరాంజనేయులు, ప్రొఫెసర్ ఆనంద్‌కిషోర్ పాల్గొన్నారు.

19న 'ఐ ఓట్ ఫర్ షూర్' 5కే రన్


హన్మకొండ అర్బన్: ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో 5కే రన్ నిర్వహించనున్నట్లు హనుమకొండ అదనపు కలెక్టర్ మహేందర్ జీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మహేందర్‌జీ మాట్లాడుతూ పశ్చిమ నియోజక వర్గంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వారు కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6గంటలకు జేఎన్‌ఎస్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు 5కే రన్ ఉంటుందన్నారు. పరకాలలో కూడా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్, పరకాల ఆర్డీఓ శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

నాలాల.. మూలాలు తేల్చేదెలా?

నగరంలో నాలాల విస్తరణకు అడుగడుగునా ఆటంకాలు
- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో అధికారుల్లో లబ్‌డబ్
- రాజకీయ జోక్యం.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న వ్యతిరేకత
- పలుచోట్ల కొనసాగుతున్న కూల్చివేతల పర్వం



కూల్చివేత..
హసన్‌పర్తి: వడ్డేపల్లి నుంచి గోపాలపురం చెరువు వరకు వెళ్లే నాలా విస్తరణకు బుధవారం భవనాలకు మార్క్ చేయగా, వాటి కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. గురువారం 56వ డివిజన్ జవహర్‌కాలనీ నాలా పక్కన ఉన్న భవనాలు కూల్చివేశారు. అన్ని అనుమతులు ఉన్న భవనాలను ఎలా కూల్చివేస్తారంటూ బాధితులు అడ్డగించారు. అప్పులు చేసి ఇళ్లు, ప్లాట్లు కొన్నామని వాపోయారు. ఇళ్లపై బ్యాంక్‌ల నుంచి రుణాలు కూడా పొందినట్లు వివరించారు. రెవెన్యూ మ్యాప్‌లో అసలు ఇక్కడ కాల్వ లేదని చెప్పారు.

వరంగల్ అర్బన్: వర్షాకాలంలో నగర ప్రజలను వరదముంపు కష్టాలనుంచి తప్పించేందుకు చేపట్టిన చర్యలు వేగంగా ముందుకు సాగడం లేదు. నాలాల ఆక్రమణ మూలాలను తేల్చేందుకు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒకవైపు రాజకీయ జోక్యం, మరోవైపు స్థానికుల నుంచి నిరసనలతో సమస్య జటిలంగా మారుతోంది. గత నెలలో కురిసిన అతి భారీ వర్షాలకు నగరంలోని చాలాప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. నాలాలు ఆక్రమణలతో కుచించుకుపోయి వరద సాఫీగా వెళ్లకపోవడం.. ఆ నీరంతా కాలనీల్లోకి రావడంతో ముంపు తీవ్రత ఎక్కువైందని గుర్తించారు. వరద ముంపు ప్రాంతాలపై సమీక్షించిన మంత్రి కేటీఆర్.. అసలు నాలాల మూలాలు తేల్చాలని బల్దియా అధికారులను ఆదేశించారు. దీంతో వారం రోజులుగా హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంల ద్వారా నాలాలపై అనధికార నిర్మాణాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. జీడబ్ల్యూఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సిబ్బంది పాల్గొంటున్నారు. బుధవారం హనుమకొండ నయీంనగర్ నాలా వద్ద ఆక్రమణల మార్కింగ్, కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులు గురువారం రాజాజీ నగర్, నయీంనగర్ నాలా వద్ద ఇదే పరిస్థితి ఎదురైంది. వీలైనంత మేరకు తొలగించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని అధికారులు బల్దియా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కేటీఆర్, ఈఎన్‌సీ, బల్దియా పాలక వర్గ పెద్దలు, ఉన్నతధికారులు ఆదేశాల మేరకు ఆయా విభాగాల అధికారులు మాత్రం నిత్యం క్షేత్రస్థాయిలో నాలాలను తేల్చడంతోపాటు, ఆక్రమణల తొలగింపుపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

ముందుకు సాగేదెలా..?
- హనుమకొండ జవహర్ నగర్ వరకు నాలా సుమారు 2 కిలోమీటర్లు ఉంటుంది. ప్రస్తుతం 30 నుంచి 40 అడుగుల విస్తీర్ణం ఉండగా, భవిష్యత్ అవసరాల రీత్యా 66 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో చాలా మేరకు అనుమతి ధ్రువీకరణ పత్రాలు పొందిన భవనాలు కూల్చివేసే పరిస్థితి నెలకొంది. మార్కింగ్ చేసిన అధికార యంత్రాంగం ఎలా ముందుకు సాగాలో అర్థం కాక తలలు పట్టుకుంటోంది.
- సమ్మయ్య నగర్, రాజాజీ నగర్, నయీంనగర్, బొక్కలగడ్డ, ఈద్గా, పెగడపల్లి డబ్బాలు నుంచి నేరుగా కెనాల్ టన్నెల్ వరకు నాలా 3 కిలోమీటర్ల పొడవు ఉంది. ప్రస్తుతం 30 నుంచి 40 అడుగుల విస్తీర్ణం ఉండగా, 82 అడుగులకు పెంచనున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ముందుగా నయీంనగర్ నాలాపై కల్వర్టు నిర్మించాలని, తదుపరి కూల్చివేతలు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేశారు.
- వరంగల్ కాకతీయ మ్యూజికల్ గార్డెన్ నుంచి సరస్వతీ కాలనీ, రంగంపేట, ములుగు రోడ్డు మీదుగా అలంకార్ పెద్ద మోరీ వరకు 1.50కిలోమీటర్ల మేర 40 అడుగుల విస్తీర్ణంలో ఉన్న దీనిని 82 అడుగుల మేర విస్తరించేందుకు ఖరారు చేశారు. గతంలో కనీసం నాలాల స్థలాలను పట్టించుకోకుండా ఇప్పుడు ఇళ్లు కూల్చివేస్తామంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తమకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరు..
ఎవరు అడ్డు వచ్చినా ఆగకుండా నాలాలను ఆధునీకరిస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినప్పటికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలంగా లేవు. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఆస్తుల తొలగింపు ప్రక్రియ క్లిష్టమైనది కావడం.. చట్టపరమైన ఇబ్బందులు ఉండటం.. నాలాలపై ఇళ్లున్న వారిలో పేదలుండటం తదితర కారణాలతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

డక్ట్ డ్రెయిన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం


హసన్‌పర్తి: మాట్లాడుతున్న నవీన్‌కుమార్

హసన్‌పర్తి: వడ్డేపల్లి వరద ముంపు సాధన సమితి సమావేశం గురువారం జరిగింది. సాధన సమితి అధ్యక్షుడు బానోతు నవీన్ కుమార్ మాట్లాడారు. వడ్డేపల్లి తూమునుంచి వంద ఫీట్ల రోడ్డు శ్యామ గార్డెన్ వరకు డక్ట్ డ్రెయిన్ నిర్మాణం చేపడితే వరద ముంపు శాశ్వత పరిష్కారమవుతుందని తెలిపారు. నాలా విస్తరణ కోసం మార్కింగ్ చేయడం వల్ల శాశ్వత భవనాల యజమానులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న భవనాలకు ఎలాంటి నష్టం చేయొద్దని హైకోర్టు నుంచి ఉత్తర్వులు కూడా తీసుకొచ్చినట్లు నవీన్‌కుమార్ తెలిపారు. సమావేశంలో గడ్డం రాజ్‌కుమార్, మానుపాటి రవీందర్, విజేందర్ పాల్గొన్నారు.

గడువుకు ముందే దరఖాస్తుల రికార్డు బ్రేక్
- 13రోజులకు 3,409 దరఖాస్తులు.. రూ.68 కోట్ల ఆదాయం
- నేడు వైన్స్ టెండర్లకు ఆఖరి రోజు

కాజీపేట అర్బన్: వైన్స్ టెండర్లు చివరి రోజు గడువుకు ఒక రోజు ముందే గత ఏడాది దరఖాస్తుల రికార్డును బ్రేక్ చేసింది. వరంగల్ అర్బన్ జిల్లాలోని 65 వైన్స్‌కు గాను 2021-23లో 2,983 దరఖాస్తులతో రూ.59 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, 2023-25 టెండర్లలో దరఖాస్తుల స్వీకరణ గడువు చివరి రోజు శుక్రవారం కాగా, ఒక రోజు ముందే గురువారం నాటికి 3,409 దరఖాస్తులతో రూ.68 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. శ్రావణ మాసం తొలి శుక్రవారం.. దరఖాస్తులకు చివరి రోజు కావడంతో నేడు మరో వెయ్యి దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. కాగా, 13వ రోజు గురువారం వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో వరంగల్ అర్బన్‌కు 315, ఖిలావరంగల్‌కు 292, హనుమకొండకు 559, కాజీపేట ఎక్సైజ్ స్టేషన్‌కు 350 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సీఐలు రామకృష్ణ, అంజీత్‌రావు, చంద్రమోహన్‌లు స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది.

టీఎస్-బీపాస్‌లోనే అనుమతులు పొందాలి
బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: టీఎస్-బీపాస్‌లోనే నూతన భవన నిర్మాణ అనుమతుల ధ్రువీకరణ పత్రాలు పొందాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం ఆయన గ్రేటర్ వరంగల్ పరిధిలోని నయీంనగర్ నాలా, ప్రెసిడెన్సీ స్కూల్ వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను, పలు డివిజన్‌లలో పారిశుద్ధ్యాన్ని, టీఎస్ బీపాస్ కింద భవన నిర్మాణ అనుమతుల నిమిత్తం స్థలాలను పరిశీలించారు. టీఎస్ బీపాస్‌లోనే భవన నిర్మాణ అనుమతులు పొంది నిబంధనలను పాటిస్తూ ఎలాంటి డీవియేషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

పీహెచ్‌డీ సీట్లు పెంచాలని ఆందోళన


వీసీ రమేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీట్లు తక్కువగా ఉన్నాయని, వెంటనే పెంచాలని, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను వాయిదావేయాలని గురువారం వివిధ విద్యార్థిసంఘాల బాధ్యులు ఆందోళన చేశారు. ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న హ్యూమనిటీస్ భవనం భవనంలోనికి వెళ్లే యత్నం చేయగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఇరువురికి వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్టేషన్‌కు తరలించారని సమాచారం. అనంతరం మళ్లీ విద్యార్థి సంఘాల బాధ్యులు క్యాంపస్‌కు చేరుకొని ఓ దిష్టిబొమ్మను తీసుకొని పరిపాలనాభవనం వైపు వెళ్లారు. అప్పటికే అక్కడ పోలీసులు ఉండటంతో ఆ దిష్టిబొమ్మను చెట్లలో పడేశారు. వీసీ తాటికొండ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై సంబంధిత డీన్‌లకు లేఖ రాస్తామని వీసీ రమేష్ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల బాధ్యులు మంద నరేష్, మచ్చ పవన్ కళ్యాణ్, పాషా, మనోహర్, తిరుపతి, రాకేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు సహకరించాలి
వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కరీమాబాద్: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్న వారికి హెల్ప్‌డెస్క్ సిబ్బంది సలహాలు, సూచనలు చేస్తూ, వారి అనుమానాలను నివృత్తి చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఎక్సైజ్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి, మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. ఈక్రమంలోనే మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారితో కలెక్టర్ మాట్లాడారు. దరఖాస్తుల ప్రక్రియపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ కలెక్టర్‌కు వివరించారు.

లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేయాలి
ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ కార్పొరేషన్, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గ్రౌండింగ్ కాకుండా మిగిలి ఉన్న యూనిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, డాక్టర్ బాలకృష్ణ, నరేష్‌నాయుడు పాల్గొన్నారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి
వరంగల్ జిల్లాలో శనివారం నిర్వహించనున్న 5కేరన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బల్దియా కమిషనర్ రిజ్వాన్‌బాషా, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీలతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం
హన్మకొండ: పలు అభివృద్ధి పనులకు వరంగల్ అర్బన్ జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం సమావేశం ఆమోదం తెలిపింది. గురువారం హనుమకొండలోని జెడ్పీ కార్యాలయంలో స్థాయీసంఘాల సమావేశాలు జరిగాయి. జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ అధ్యక్షతన 2, 4, 7, 1వ స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. 1, 7వ స్థాయి సంఘం సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు రూ.1.30 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. 7వ స్థాయీ సంఘంలో రూ.1.30 కోట్లతో 51 పనులు చేపట్టేందుకు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన 3వ స్థాయీ సంఘం సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, వ్యవసాయ మార్కెటింగ్, పశు వైద్య, సామాజిక అడవుల పెంపకంపై సమీక్షించారు.

జనగామకు 'పల్లా'.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు 'కడియం'?
ఇద్దరు ఎమ్మెల్సీలకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ 'నోమా'లో ముత్తిరెడ్డి బలప్రదర్శన
- రాజశ్యామల యాగంలో రాజయ్య





కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్: జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ టికెట్ రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఖాయమైనట్లు సమాచారం. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు అత్యంత విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయమై అధిష్టానం అధికార ప్రకటన చేయకపోగా.. ఎమ్మెల్సీలు సైతం మాట్లాడటం లేదు. దీంతో సిట్టింగ్‌లకే టికెట్ ఇవ్వాలని ఇద్దరు ఎమ్మెల్యేల అనుచరులు హైదరాబాద్ బాట పట్టారు.

'నోమా'లో ముత్తిరెడ్డి బల ప్రదర్శన...
'పల్లా మా కొద్దు.. ముత్తిరెడ్డే ముద్దు' అంటూ 8 మండలాలకు చెందిన సుమారు వెయ్యి మంది ముత్తిరెడ్డి వర్గీయులు గురువారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ముత్తిరెడ్డికి చెందిన 'నోమా'ఫంక్షన్ హాల్‌లో సమావేశమై ఆయనకు మద్దతు తెలిపారు. ముత్తిరెడ్డిని కాదనుకుంటే జనగామ నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాజశ్యామల యాగంలో రాజయ్య...
వివాదాల సుడిగుండంలో ఉన్న స్టేషన్ ఘన్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను కాదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరగడంతో రాజయ్య ఆగమాగమై శత్రువుల నుంచి విముక్తి లభించేలా రాజశ్యామల యాగంలో నిమగ్నమయ్యారు. దీంతోపాటు రాజయ్యకే టికెట్ ఇవ్వాలని 300 మంది అనుచరులు గచ్చిబౌలిలోని మంత్రి హరీశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా పల్లా, కడియం పేర్లు ఖరారయ్యాయన్న ప్రచారంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ టి.రాజయ్యలు తమ భవిష్యత్ కార్యాచరణపై నోరువిప్పడం లేదు.

కాంగ్రెస్‌లో పోటాపోటీ..



నేటినుంచే దరఖాస్తులు.. ములుగు, భూపాలపల్లి మినహా అన్ని చోట్లా పోటీ
- ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు నుంచి నలుగురుపైనే ఆశావహులు
- ఢిల్లీ, హైదరాబాద్‌ల చుట్టూ ఇప్పటికే చక్కర్లు...
- హస్తినకు చేరిన జనగామ వివాదం.. మరో మూడు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి
- పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు ఇతర పార్టీల నేతల పేర్లు
- ఖరారైతే పార్టీలో చేరేందుకు మంతనాలు..
- ఓరుగల్లులో వేడెక్కిన హస్తం రాజకీయాలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

కాంగ్రెస్ పార్టీలో టికెట్ల రేసు మొదలైంది. శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుకానుండడంతో ఆశావహులు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. సుమారు వారం రోజులపాటు స్వీకరించే ఈ దరఖాస్తుల కోసం ఉమ్మడి వరంగల్ నుంచి పలువురు పోటీ పడుతున్నారు. ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాలు మినహా పది చోట్ల టికెట్ ఆశించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వచ్చే నెల మొదటి వారంలోనే పీఈసీ సమావేశంలో దరఖాస్తులను పరిశీలించే అవకాశం ఉన్నందున టీపీసీసీ ఈ నెల 18 నుంచి 25 తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించింది. దీంతో ఆశావహులు పోటాపోటీగా టికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

రెండింట్లోనే ఒక్కొక్కరు.. మిగతా చోట్ల పోటాపోటీ..
ఉమ్మడి వరంగల్‌లో ములుగు, భూపాలపల్లి జిల్లాలనుంచి పోటీ లేదు. ములుగులో సిట్టింగ్ ఎమ్మెల్యే ధనసరి సీతక్క, భూపాలపల్లినుంచి గండ్ర సత్యనారాయణలు పోటీ చేయనుండగా.. మిగతా చోట్ల పోటాపోటీగా దరఖాస్తులు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.
- వర్ధన్నపేట నుంచి బరిలో దిగేందుకు పలువురు పోటీ పడుతున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నియోజకవర్గ సమన్వయకర్త నమిండ్ల శ్రీనివాస్‌ల మధ్య టికెట్ పోరు తారస్థాయికి చేరగా.. తాజాగా మాజీ పోలీసు అధికారి కె.ఆర్.నాగరాజు ఈ నియోజకవర్గంపై కన్నేశారు. ఇటీవల పార్టీలో చేరిన ఆయన దూకుడుగా ఉన్నారు. దొమ్మాటి సాంబయ్య కూడా టికెట్ ఆశిస్తున్నట్లు పార్టీలో ప్రచారం ఉంది.
- వరంగల్ తూర్పు నియోజకవర్గంనుంచి గెలిచిన కొండా సురేఖ మళ్లీ పోటీ చేసేందుకు సన్నద్ధమవుతుండగా.. ఆమెకు దాదాపుగా టికెట్ ఖాయమన్న ప్రచారం ఉంది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కూడా సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. డీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ కూడా ఇక్కడినుంచి టికెట్ ఆశిస్తున్నారు.
- వరంగల్ పశ్చిమలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పోటీ చేస్తానంటూ పదేపదే ప్రకటించడంతోపాటు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, గతంలో పాలకుర్తినుంచి పోటీచేసి ఓడిపోయిన జంగా రాఘవరెడ్డి వరంగల్ పశ్చిమ నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించి కార్యక్రమాలు చేస్తున్నారు. మరోవైపు వేం నరేందర్‌రెడ్డి పేరు కూడా ప్రచారంలో ఉంది.
- జనగామ నుంచి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు ఎవరికి వారుగా గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. వీరిద్దరి మధ్య పోరు తారస్థాయికి చేరగా.. ఇటీవల కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని జనగామ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించడంపై పొన్నాల లక్ష్మయ్య ఢిల్లీలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే వీరిద్దరు విడివిడిగా కార్యక్రమాలు చేస్తున్నారు.
- పాలకుర్తిలో గత ఎన్నికల్లో పోటీ చేసిన జంగా రాఘవరెడ్డి ఈసారి వరంగల్ పశ్చిమపై దృష్టిసారించడంతో పాలకుర్తి నుంచి కొత్తవారి పేర్లు వినిపిస్తున్నాయి. వరంగల్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ధన్వంతి భర్త టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ పేరు ప్రచారంలో ఉంది. తాజాగా పారిశ్రామికవేత్త, ఎన్‌ఆర్‌ఐ హనుమండ్ల ఝాన్సీరెడ్డి రంగ ప్రవేశం చేసి నియోజకవర్గంలో తిరుగుతున్నారు.
- పరకాలలో గతంలో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన ఇనుగాల వెంకట్రాంరెడ్డి మరోసారి పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సైతం పరకాల నుంచి అవకాశం ఇస్తే బరిలో నిల్చుంటానంటూ వెల్లడించారు. ఇదే సమయంలో రెండు నెలల కిందట వరంగల్‌లో కొండా, ఇనుగాల వర్గీయుల మధ్య గొడవ కూడా జరిగింది. ఈ ఇద్దరికీ తోడు కొత్తగా బీజేపీలో సీనియర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కూడా పార్టీ మారి పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారంటున్నారు.
- డోర్నకల్ నియోజకవర్గం నుంచి డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, నెహ్రూ నాయక్, నునావత్ భూపాల్ నాయక్‌లు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. కొంతకాలంగా రెండు వర్గాలుగా ఏర్పడి వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాంచంద్రునాయక్ 2014లో టీడీపీ, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓడిపోయారు. నెహ్రూనాయక్, మరో యువనేత, ఎన్‌ఆర్‌ఐ నానావత్ భూపాల్‌నాయక్‌లు మొదటిసారి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ ముగ్గురు దరఖాస్తు చేసుకోనున్నారు.
- మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్య నాయక్, డాక్టర్ భూక్యా మురళీనాయక్‌లు పోటీ పడుతున్నారు. ఇటీవల బలరాంనాయక్, బెల్లయ్యనాయక్ కలిసి ఒకే వేదికగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి ఇద్దరిలో టికెట్ ఎవరికి వచ్చినా పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని ప్రకటించారు. మురళీనాయక్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డిపై భరోసాతో ఉన్నారు.
- నర్సంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి టికెట్ తనదేనన్న ధీమాతో ఉన్నారు. నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఊరూరా జోడోయాత్ర కూడా చేశారు. గతంలో కాంగ్రెస్‌నుంచి పోటీ చేసిన కత్తి వెంకటస్వామి సైతం ఇక్కడినుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందంటున్నారు. ఓ బీజేపీ సీనియర్ నేత పేరు కూడా వినిపిస్తోంది.
- గతంలో వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఈసారి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన సింగారపు ఇందిర కూడా ఈసారి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఇద్దరు దరఖాస్తు చేసుకోనుండగా.. జిల్లాలోని ఓ ఎమ్మెల్యే పార్టీ మారితే కాంగ్రెస్ టికెట్ అడగవచ్చన్న ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు

దేశాయిపేట: బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్య సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల గడువు సెప్టెంబర్ 5వ తేదీ వరకు పెరిగిందని సీకేఎం కాలేజీ అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్ డా.ఏ ధర్మారెడ్డి, ప్రిన్సిపాల్ డా.జి.శశిధర్‌రావు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండేళ్లపాటు ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి, ఆసక్తి కలిగిన వారు సెప్టెంబర్ 5లోపు braouonline. inలో రిజిస్ట్రేషన్ చేసుకుని సంబంధిత సర్టిఫికెట్లతో సహాయ కేంద్రానికి వచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు. నిర్ధారించిన ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి అడ్మిషన్ పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు 73829 29618 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఇటీవల నిర్వహించిన బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం అధికారులు గురువారం విడుదల చేశారు. ఆ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన 10 రోజుల్లోనే మూల్యాంకనం చేయించి ఫలితాలు విడుదల చేయడం గమనార్హం. ఆయా పరీక్షల ఫలితాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు.

పాత పద్ధతినే అమలు చేయాలి

కాజీపేట రూరల్: రన్నింగ్ స్టాఫ్‌లో గతంలో మాదిరిగా పాత పద్ధతిన పర్సనల్ బాక్స్ సిస్టం లేదా కొత్తగా లోకోలోనే టూల్స్ బాక్స్‌ను ప్రవేశపెట్టే విధానాన్ని అమలు చేయాలని గురువారం రైల్వే నాయకులు తెలిపారు. డిటోనేటర్లు పంపిణీ చేయకుండా గతంలో ఎత్తివేసిన పాత పద్ధతిన పర్సనల్ బాక్స్‌లు ప్రవేశపెట్టాలని లేదా కామన్‌లైన్ బాక్స్‌ల సీఎల్‌ఐ, సీసీసీల నిర్వహణను కొనసాగించాలని వారు పేర్కొన్నారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా కొత్తగా ప్రతిపాదనలో ఉన్న రైలు ఇంజన్‌లోనే టూల్స్ కిట్ ప్రవేశపెట్టే సిస్టంను అమలు చేయాలని రైల్వే నాయకులు కోరుతున్నారు. డిటోనేటర్ల పద్ధతిని కార్మిక నాయకులు, కార్మికులంతా వ్యతిరేకిస్తున్నప్పటికీ రైల్వే యంత్రాంగం మాత్రం ఏఎల్‌పీలు డిటోనేటర్లు తీసుకోకుంటే చార్జీషీట్లు జారీ చేస్తూ భయాభ్రాంతులకు గురిచేయడంపై రైల్వే నాయకులు, ఏఎల్‌పీలు నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

మహబూబాబాద్ రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులైన ముగ్గురు యువకుల నుంచి రూ.62 లక్షలు వసూలు చేసిన ఇద్దరిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌కోలో జేఎల్‌ఎం ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన ప్రైవేట్ లెక్చరర్ ఇరుకులపాటి నాగేశ్వరరావు, మండల సహోదరరెడ్డిపై నరాల మల్లేశం అనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వై.సతీశ్ తెలిపారు.



నేటితో 'వరంగల్' పదవీకాలం ముగింపు

రిజర్వేషన్‌లో ఎస్సీ మహిళకే మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి

- ఈసారి వర్ధన్నపేట నియోజకవర్గానికి అవకాశం
- ఎన్నికల తర్వాతే నూతన పాలకవర్గ నియామకం?



వరంగల్ వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం పదవీకాలం నేటి (శుక్రవారం)తో ముగియనుంది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఉద్యమకారులకే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలన్న డిమాండ్ అప్పటి టీఆర్‌ఎస్ పార్టీలో వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే డిమాండ్ రావడంతో అన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చైర్మన్ పదవికి రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఐదేళ్ల వరకు రిజర్వేషన్లు వర్తింపజేస్తూ డ్రా పద్ధతిలో చైర్మన్‌ల పదవీ కాలాన్ని నిర్ణయించారు.

రిజర్వేషన్ ఇలా..

మొదటిసారి జనరల్, రెండోసారి బీసీ, మూడోసారి ఎస్సీ మహిళ, నాలుగో సారి జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి కాంగ్రెస్‌కు చెందిన మంద వినోద్‌కుమార్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన 02–09–2013లో చైర్మన్‌గా నియమితులై 28.02.2015 వరకు కొనసాగారు. రిజర్వేషన్ అమల్లోకి రావడంతో తొలి శాసనసభ స్పీకర్‌గా ఉన్న మధుసూదనాచారి అనుయాయుడు పరకాల నియోజకవర్గానికి చెందిన కొంపెల్లి ధర్మరాజుకు వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. ఆయన 15–10–2016 నుంచి 06–10–2018 వరకు పూర్తిగా రెండేళ్ల పాటు చైర్మన్‌గా పని చేశారు. మరోసారి పదవి పొడిగించుకోవాలని ప్రయత్నించినప్పటికీ ఉద్యమకారుడి కోటాలో అదే నియోజకవర్గానికి చెందిన చింతం సదానందం చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. ఆయన 21 డిసెంబర్ 2019లో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి అయినప్పటికీ మరో ఆరు నెలల పాటు పొడిగింపు పొందడంతో 19–06–2021వరకు ఏడాదిన్నర పాటు పదవిలో కొనసాగారు. మరో ఆరునెలలు పొడిగింపునకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ మేయర్ పదవి దిడ్డి కుమారస్వామికి దక్కకపోవడంతో మార్కెట్ పదవి కావాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే పట్టుబట్టి దిడ్డి కుమారస్వామి సతీమణి భాగ్యలక్ష్మిని చైర్‌పర్సన్‌గా చేశారు. కాగా.. కాజీపేట, పరకాలకు చెందిన నాయకులకు చైర్మన్ పదవీ ఇవ్వాలని ఇతర పెద్ద నాయకులు ప్రయత్నించినప్పటికీ గ్రేటర్ రాజకీయాల వల్ల ఉద్యమకారులకు దక్కకుండా పోయింది. దిడ్డి భాగ్యలక్ష్మి చైర్‌పర్సన్‌గా 19–08–2021నుంచి 18–07–2022 వరకు కొనసాగారు. మరో ఏడాది పాటు కమిటీ గడువు పెంచాలని తీవ్రంగా ప్రయత్నాలు చేసినా పొడిగించలేదు. ఈసమయంలోనే పరకాల నియోజకవర్గానికి చెందిన ఒక నాయకుడికి ఈ పదవి కట్టబెట్టాలని జిల్లాకు చెందిన మంత్రి తీవ్రంగా ప్రయత్నించడం వల్ల ఉన్న కమిటీ పొడిగింపులో జాప్యం జరిగింది. కొత్త చైర్మన్ నియామకానికి రిజర్వేషన్ అడ్డంకిగా మారడంతో చివరికి ఇదే కమిటీ కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో దిడ్డి భాగ్యలక్ష్మి 18–08–2023 వరకు చైర్‌పర్సన్‌గా రెండేళ్ల పాటు పదవీ కాలం పూర్తి చేసుకున్నారు.

ఈసారైనా దక్కేనా?

వరంగల్ మార్కెట్ కమిటీ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆప్రాంతానికి చెందిన వారికి చైర్మన్ పదవి దక్కలేదు. గతంలో చైర్మన్ పదవి తన నియోజకవర్గానికే ఇవ్వాలని ఎమ్మెల్యే అరూరి రమేశ్ పట్టుబట్టినప్పటికీ వచ్చేసారి రిజర్వేషన్ అమలు అవుతున్నందున తప్పకుండా అవకాశం ఇస్తామని పార్టీ అధిష్టానం చెప్పడంతో ఆయన మిన్నకుండిపోయారు. అందువల్ల ఈసారి వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన వారికే పదవి అనే ప్రచారం జరుగుతోంది. కానీ ఎన్నికల ముందు నూతన కమిటీ ఏర్పాటు చేసి తలనొప్పి ఎందుకు తెచ్చుకోవాలన్న ఆలోచన సైతం నాయకులు చేస్తున్నట్లు తెలిసింది. శుక్రవారంతో మార్కెట్ పాలకవర్గం పదవీకాలం పూర్తి అవుతున్నందున కొత్త కమిటీని నియమిస్తారా? ఎన్నికలు ముగిసే వరకు స్పెషల్ ఆఫీసర్‌తో పూర్తి చేస్తారా? అనేది వేచి చూడాలి.

చేపల పెంపకంతో ఆదాయం

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ
- చేప పిల్లల పెంపకం.. పాండ్ ప్రారంభం



పీటీసీ పాండ్‌లో చేపపిల్లలు పోస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు: చేపల పెంపకంతో మంచి ఆదాయం లభిస్తుందని, రానున్న రోజుల్లో ట్రెనింగ్ అభ్యర్థులకు పోషకాలతో కూడిన చేపల కూరతో ఆహారం అందించే అవకాశం ఉందని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ(ఎస్పీ), మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గణేశ్ అన్నారు. గురువారం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో చేప పిల్లల పెంపకానికి పాండ్‌ను కృషి విజ్ఞాన కేంద్రం అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె పాండ్‌లో చేప పిల్లలను పోశారు. అనంతరం పూజ మాట్లాడుతూ పాండ్‌లో 1500 చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేశ్, వెంకటేశ్వరావు, శ్రీనివాస్, భిక్షపతి, పాండునాయక్, సీఐలు చంద్రశేఖర్, నవీన్, కాశీరామ్, మహేశ్, సీఎల్ఐ నరేశ్, రవికిరణ్, వడ్డె నరేశ్, ఏఎల్ఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ యుగేంధర్, రాందాస్, జగదీశ్, రహమతుల్లా, చంద్రమౌళి, అశోక్, వెంకట్, పీఆర్‌ఓ రామాచారి పాల్గొన్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు ఆహ్వానం

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎస్‌డీఎల్‌సీఈ(దూరవిద్య) డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ఈవిద్యా సంవత్సరం 2023–24లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిగ్రీలో బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, కంప్యూటర్స్, బీఎల్‌ఐఎస్‌సీ, పీజీ కోర్సుల్లో ఎంఏ ఇంగ్లిష్, హిందీ, సాంస్క్రిట్, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్‌సైన్స్, ఎంఏ హెచ్‌ఆర్‌ఎం, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎం(జేఎంసీ), సైన్స్ కోర్సుల్లో ఎమ్మెస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

ఏడాది డిప్లొమా కోర్సులు

యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్స్ ఇన్షియేటెడ్ ప్రోగ్రామ్స్ యాస్ పార్ట్ ఆఫ్ ఎన్‌ఈపీ 2020 పర్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం కింద ఏడాది డిప్లొమా కోర్సుల వివరాలిలా ఉన్నాయి. డిప్లొమా బిజినెస్ మేనేజ్‌మెంట్, డిప్లొమా ఇన్ రూరల్ మార్కెటింగ్, డిప్లొమా ఇన్ టాలీ, డిప్లొమా కంప్యూటర్ అప్లికేషన్స్, డిప్లొమా ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, డిప్లొమా ఇన్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (సీఎల్‌ఐఎస్సీ) కోర్సులతోపాటు మూడు నెలల ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్ కూడా ఉన్నాయని వాటిలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఎలాంటి అపరాధ రుసుములేకుండా సెప్టెంబర్ 11వరకు, రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 12 నుంచి 21 వరకు, రూ.300ల అపరాధ రుసుముతో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 7వరకు, ఇదే అక్టోబర్ 7 చివరి గడువు అని శ్రీనివాస్‌రావు తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్ ఎస్‌డీఎల్‌సీఈ క్యాంపస్‌లోనూ చేసుకోవచ్చని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌డీఎల్‌సీఈ.కో.ఇన్‌లో అన్ని వివరాలు పొందుపర్చినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



నాగు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

డోర్నకల్: మండలంలోని రాముతండా జీపీ పరిధి లకావత్‌తండాకు చెందిన రైతు బానోత్ నాగు(32) గురువారం మృతి చెందాడు. నాగు వ్యవసాయ భూమి మీదుగా విద్యుత్ లైన్ కోసం స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల క్రితం లైనుకు సంబంధించిన వైరు తెగి స్తంభం పక్కనే కిందికి వేలాడుతోంది. ఈక్రమంలో గురువారం నాగు తన భూమిలో మిరప సాగు చేసేందుకుగాను చదును చేస్తుండగా.. వైరు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

మృతదేహంతో ఆందోళన

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే నాగు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహాన్ని తొడేళ్లగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో సీఐ ఉపేందర్‌రావు కుటుంబ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు అంగీకరించకుండా చీకట్లోనూ ఆందోళన కొనసాగించారు. నాగు మృతిపై డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన పైపులు



ఆసిఫ్ మృతదేహం

జనగామ: అదనపు లైటింగ్ ఏర్పాటుకు ఐరన్ పైపులు తీసుకొస్తుండగా.. ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు, బాధితుడు బాబా తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కాచిగూడకు చెందిన ఇద్దరు స్నేహితులు ఎస్‌డీ బాబా, ఎండీ ఆసిఫ్ జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులో గల నాగరాజు అలియాస్ లల్లూ కార్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నారు. బాబా ఏడేళ్లుగా పని చేస్తుండగా.. ఆసిఫ్ రెండ్రోజుల క్రితమే వచ్చాడు. సర్వీసింగ్ సెంటర్‌లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేసేందుకు సర్వీసింగ్ సెంటర్ యజమానికి పైపులు తీసుకొచ్చేందుకు వెళ్లారు. బిల్డింగ్ రెండో అంతస్తుపై ఉన్న ఐరన్ పైపులు తీసుకొచ్చే క్రమంలో మొదటి అంతస్తుకు చేరుకున్నారు. రేలింగ్ పక్కనే ఉన్న 11 కేవీ వైర్లకు పైపులు తగిలాయి. దీంతో ఇద్దరు యువకులు అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. స్థానికులు స్పందించి ఇద్దరిని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండ్రోజుల క్రితం పనిలో చేరిన ఆసిఫ్ చికిత్స పొందుతూ మృతి చెందగా.. బాబాకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తండ్రి షకీల్ కాచిగూడలో రోజువారీ కూలీగా పని చేస్తుండగా.. కుటుంబానికి ఆసరాగా ఉండాలని ఆసిఫ్ జనగామలో కారు సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. పనిలో చేరిన రెండ్రోజులకే ఆసిఫ్ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. సీఐ ఎలబోయిన శ్రీనివాస్ ఘటనాస్థలికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పాముకాటుకు దివ్యాంగుడు బలి



కరుణాకర్(ఫైల్)

నర్మెట: మండలంలోని వెల్దండకు చెందిన దివ్యాంగుడు కాసర్ల కరుణాకర్ (26) పాము కాటుతో బుధవారం మృతి చెందాడు. కరుణాకర్ రాత్రి నేలపై పడుకున్నాడు. కొద్దిసేపటికి ఏదో కుట్టినట్లుగా అనిపించడంతో నిద్రిస్తున్న తల్లిని, భార్యను లేపి విషయం చెప్పాడు. వారు లేచి చూడగా.. కట్లపాము కనిపించింది. పామును కరుణాకర్‌ను చికిత్స కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా మృతి చెందాడు.

గంజాయి రవాణాలో ఏపూరు వాసులు?

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన ఓ ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌లో గంజాయి రవాణా కేసులో పట్టుబడినట్లు గురువారం మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. మూడ్రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు రాత్రి తెల్లవార్లు ఏపూరు గ్రామం చుట్టూ ఆ ఇద్దరు వ్యక్తుల కోసం గాలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వారిలో ఓ వ్యక్తి పట్టుబడినట్లు, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది. కొన్నేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఖరీదైన కార్లలో గంజాయి పట్టుకొచ్చి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రవాణా చేస్తున్న కొందరిని ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు గుర్తించగా.. వారిలో గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఉన్నారనే విషయం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- రెడ్డి జేఏసీ రాష్ట్ర నేత జైపాల్‌రెడ్డి
- సమస్యల పరిష్కారానికి 19న 'చలో కలెక్టరేట్'



సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2018 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ.5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఇతర హామీలు నెరవేర్చాలని రెడ్డి ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ పోస్టల్ కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి జైపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధి వివిధ జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్న ఈసమావేశంలో జైపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ రెడ్లను అడుగడుగునా మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో రెడ్డి కులస్తులు తరలి వచ్చి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దిగిరాకపోతే త్వరలో రాష్ట్రస్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చదంపట్ల నరసింహారెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు పత్తి సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఊకంటి వనంరెడ్డి, రెంటాల కేశవరెడ్డి, కట్కూరి వాసుదేవరెడ్డి, పుద్దసాని వెంకట్‌రెడ్డి, కంకణాల సంపత్‌రెడ్డి, తాటిపెల్లి గణపతిరెడ్డి, నల్లా రాజిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్టడీ టూర్‌కు వచ్చిన మార్కెట్ సెక్రటరీలు

- వరంగల్‌లో రెండ్రోజుల పాటు శిక్షణ
- మార్కెట్ సందర్శన



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఎం మల్లేశం

వరంగల్: తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మార్కెట్ కమిటీల, 130వ బ్యాచ్‌కు చెందిన మార్కెట్ కార్యదర్శులు ఉద్యోగ నిర్వహణ, పదోన్నతుల్లో భాగంగా రెండ్రోజుల శిక్షణ కోసం గురువారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జేడీఎం ఇన్నారపు మల్లేశం మాట్లాడుతూ.. ఆసియాలోనే పెద్ద మార్కెట్‌గా వరంగల్ వ్యవసాయ మార్కెట్ ప్రాచుర్యం పొందిందని, అందువల్ల ఇతర రాష్ట్రాలకు చెందిన అధికారులు వచ్చినట్లు తెలిపారు. వారికి మార్కెట్‌లోని యార్డుల్లో జరుగుతున్న క్రయ, విక్రయాలు, అపరాల యార్డులు అమలవుతున్న ఈ–నామ్ అమలు తీరుతో పాటు మార్కెట్‌లో అవలంబిస్తున్న పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈశిక్షణలో తమిళనాడుకు చెందిన ఎనిమిది మంది, ఏపీ నుంచి నలుగురు, కర్ణాటకకు చెందిన ఎనిమిది మందితో మొత్తం 20 మంది కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్రానికి చెందిన డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అండ్ ఇన్‌స్పెక్షన్(డీఎంఐ) సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఫణిరాజశేఖర్, మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేంద్ర, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌తో పాటు వరంగల్ మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శులు బియాబానీ, శ్రీరాము రాము, అకౌంటెంట్ రాజ్‌కుమార్, శివకుమార్, మురళి, గంగాధర్, డెరెక్టర్లు శాంతిరతన్‌రావు, గోలి రాజయ్య పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ భంగ్

- ఏఐకేఎఫ్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ భంగ్

వరంగల్: వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడేందుకు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్)జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ భంగ్ అన్నారు. గురువారం వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రేమ్‌సింగ్ భంగ్ మాట్లాడుతూ.. స్వామినాథన్ సిఫార్సులను గతంలో యూపీఏ అమలు చేయలేదని, ఇప్పటి ఎన్డీఏ ప్రభుత్వం కూడా అమలు చేయట్లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు సదస్సులో నివాళులు అర్పించారు. రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు అధ్యక్షత వహించిన ఈసమావేశంలో ఏఐకేఎఫ్ నాయకులు మారెడ్డి వెంకట్‌రెడ్డి, ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, సాంబయ్య, బాషిపాక రమేశ్, సంపత్, తిరుపతి, రాజేశ్‌నాయక్‌తో పాటు వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి రైతు ప్రతినిధులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

సిటీ దాటేందుకు ససేమిరా..

- పైరవీల జోరు.. మాయరోగాల హోరు!

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని మండలాలు 14.. జిల్లా కేంద్రం నుంచి ఎటు వెళ్లినా 40 కిలోమీటర్లలోపు ప్రయాణమే. ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవల బదిలీ అయిన డిప్యూటీ తహసీల్దార్లు తాము సిటీ వదిలి వెళ్లలేమని, ఇక్కడే తమను సర్దుబాటు చేయాలని కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం ఆశాఖలో చర్చకు దారి తీస్తోంది. రానున్న ఎన్నికలు, సుదీర్ఘకాలం ఒకేచోట పనిచేసిన వారిని దృష్టిలో పెట్టుకుని జిల్లా ఉన్నతాధికారులు పరిపాలనా సౌలభ్యం పేరుతో అంతర్గత బదిలీలు చేశారు. బదిలీ ఉత్తర్వులు వెలువడిందే తడవుగా సగానికి పైగా.. మంది తాము కొత్త స్థానాలకు వెళ్లలేమంటూ రోజూ ఉదయం నుంచే కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. తమకు ఆరోగ్యం బాగాలేదని మెడికల్ సర్టిఫికెట్లు, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఉన్నతాధికారులు విసుగెత్తిపోతున్నారు. సిటీ చుట్టుపక్కల ఉన్న మూడు నాలుగు మండలాలు మినహా దూరం వెళ్లేందుకు ఎవరూ సుముఖంగా లేకపోవడం విశేషం.

పాత జబ్బులు బయటకొస్తున్నాయి!

డీటీ ఎం.సమ్మక్కను కలెక్టరేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు, పరకాల తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సూర్యప్రకాశ్‌ను హనుమకొండ ఆర్డీఓ ఆఫీస్‌కు, హనుమకొండ తహసీల్‌లో పని చేస్తున్న అనీఫ్‌పాషాను పరకాల తహసీల్‌కు, ఐనవోలులో పని చేస్తున్న బొల్లు రమేశ్‌ను హనుమకొండ తహసీల్‌కు బదిలీ చేశారు. కంతనపల్లి ప్రాజెక్టులో పని చేస్తున్న జంగా లక్ష్మణ్‌ను శాయంపేట తహసీల్‌కు, అక్కడ పని చేస్తున్న భద్రునాయక్‌ను ఎల్కతుర్తి తహసీల్‌కు బదిలీ చేశారు. కంతనపల్లి ప్రాజెక్ట్ చింతగట్టులో పని చేస్తున్న కృష్ణవేణిని వేలేరుకు, పౌర సరఫరాల సంస్థలో పని చేస్తున్న జి.వేణుగోపాల్‌ను భీమదేవరపల్లికి, పౌర సరఫరాల శాఖలో పని చేస్తున్న పి.శోభారాణిని ఐనవోలుకు బదిలీ చేస్తూ కలెక్టర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఒక్కసారిగా సగం మందికి పాతజబ్బులు బయటకు వచ్చాయి. మరికొందరు నేతల సిఫార్సులు సిద్ధం చేసుకున్నారు. ఈవిషయంలో కలెక్టర్ ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రస్తుతం రెవెన్యూ వర్గాల్లో ఈవిషయం చర్చనీయాంశమైంది.

వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యం



అయోధ్యపురంలో లభ్యమైన వేంకటేశ్వరుడి విగ్రహం

గూడూరు: మండలంలోని అయోధ్యపురం గ్రామంలోని పురాతన గుడి ఆవరణలో గురువారం జరిగిన తవ్వకాల్లో వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ఓ వీధి శివారు ప్రాంతంలో తమ బాల్యంలో ఓ గుడి ఉండేదని, కాలక్రమేణ ఆ గుడి కూలి మట్టి కూడుకుందని గ్రామ పెద్దలు తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆ గుడి ఆవరణ ప్రాంతంలో తవ్వకాలు మొదలు పెట్టగా.. వేంకటేశ్వరస్వామి విగ్రహం బయటపడింది. విగ్రహాన్ని చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. అందరూ కలిసి ఓ గుడి నిర్మించుకోవాలని, ఈవిషయాన్ని గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డికి తెలుపగా.. ఆయన ఎండోమెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం ఎండోమెంట్ ఈడీ గ్రామానికి చేరుకొని విగ్రహాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నిర్ణయం మేరకు సర్పంచ్ తుల సీరాంనాయక్, పెద్దలు వేణుగోపాల్ రెడ్డి, కంకటి ఉప్పలయ్యగౌడ్ సూచన మేరకు ఈనెల 19న శనివారం గ్రామస్తుల సమక్షంలో విగ్రహానికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి, గుడి నిర్మాణానికి ఏర్పాట్లు చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

కార్యాలయం తరలింపును విరమించుకోవాలి

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం తరలింపును విరమించుకోవాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ –327 టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ (17 జిల్లాల స్థాయి) అధ్యక్షుడు పి.మహేందర్‌రెడ్డి, కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి వినతిపత్రం అందించినట్లు వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం హనుమకొండ నక్కలగుట్టలో కొనసాగుతున్న వరంగల్ సర్కిల్ కార్యాలయం విద్యుత్ వినియోగదారులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు సౌకర్యవంతంగా ఉందని తెలిపారు. శిక్షణ పొందే ఉద్యోగుల వసతి కోసం ఏర్పాటు చేసిన హాస్టల్ భవనంలోకి మారిస్తే శిక్షణ పొందే ఉద్యోగులకు వసతి లేకుండా పోతుందని పేర్కొన్నారు. వరంగల్ సర్కిల్‌కు సొంతంగా నూతన భవనం నిర్మించిన తర్వాతే కార్యాలయాన్ని మార్చాలని, అప్పటి వరకు మార్పును విరమించుకోవాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లె 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-27210]

■ మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785647]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-27213]

■ Badangpet-Nadargul HMDA Approved 2 & 3BHK Luxury Flats, Flash Lauching Offer only 3 Days, Pay only 50% Now & Balance after 1 year with Amenities. Ph: 8008638238. [HA-515]

PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్ళ మధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం. లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189136]

■ మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలలో గాని తాకట్టులో వున్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 100% స్పాట్ క్యాష్ ✆ 8897552200 [T-142]

WANTED

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–16000. సంప్ర॥ 9000463426. [W-1002380]

■ స్టార్ హోంకేర్ సర్వీసు 24 గం॥ల పేషెంట్లు, పెద్దవారిని, చిన్నపిల్లలను ఇంటి వద్దనే చూసుకోవడానికి ఆడ/మగవారు కావలెను. భోజన సదుపాయం కలదు. 24 గం॥ డ్యూటీ. Cont: 8977263124, 8897730132. [W-1002379]

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర॥ 6281342090, 9949857816. [WA-7213]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.